# ముజామ్మిల్ ఖాన్.. సేవలు భేష్

పదకొండు నెలల్లోనే పెద్దపల్లి కలెక్టర్ ప్రత్యేక ముద్ర



ముజామ్మిల్ ఖాన్

పెద్దపల్లి, జూన్ 15(నమస్తే తెలంగాణ): పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌గా పదకొండు నెలల క్రితం బాధ్యతలు స్వీకరించిన ముజామ్మిల్‌ఖాన్ పాలనలో తనదైన మార్క్ చూపించారు. అసెంబ్లీ, ఎంపీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. వచ్చీరాగానే పెద్దపల్లి నూతన కలెక్టరేట్‌ను ఆకర్షణీయంగా తీర్చిద్దారు. కలెక్టరేట్ స్వాగత ద్వారంతో పాటు గోడలపై తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా కళాకృతులను వేయించారు. కార్యాలయం ఆరంభంలోనే ప్రజలకు సేవలందించేందుకు ఇన్‌వర్డ్‌తో పాటుగా ధరణి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా చరిత్ర ఉట్టిపడేలా ప్రత్యేక పురావస్తు మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు. ఇంకా ప్రతిశాఖ కార్యాలయానికి వెళ్లే కలెక్టరేట్ గోడలపై పెద్దపల్లి జిల్లాలోని చారిత్రక, పర్యాటక ప్రదేశాలతో డిజిటల్ ఫొటోలను ఏర్పాటు చేయించారు. కలెక్టరేట్‌లో పనిచేసే ఉద్యోగులు స్త్రీలు, పురుషులకు ప్రత్యేకంగా భోజన శాలలను ఏర్పాటు చేయించారు. ఎంప్లాయీస్ ఆరోగ్య స్థితిపై హెల్త్ స్క్రీనింగ్ క్యాంప్ పెట్టించి, ఫ్రెండ్లీ కలెక్టర్‌గా నిలిచారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చక్కని విద్యను అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ప్రత్యేక అధికారులను నియమించి ప్రతి బుధవారం ఒక ప్రభుత్వ పాఠశాలను, వసతి గృహాన్ని సందర్శించి అక్కడే భోజనం చేసే విధంగా 'లంచ్ అండ్ లెర్న్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించి సక్సెస్‌ఫుల్‌గా అమలు చేశారు. ఎప్పుడు ఎవరు ఫోన్ చేసినా అందుబాటులోకి వస్తూ నేరుగా ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ పేదల కలెక్టర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు అందాలని, సమస్యలతో ఎవరూబాధపడొద్దని అనేక ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించి విజయవంతంగా అమలు చేశారు. సేవ చేయడమే అభిమతంగా చదు వు, ఆపద సమయాల్లో అండగా ఉన్నారు. ఆయన వచ్చిన నెల రోజుల్లోనే అంటే.. గత జూలైలో మంథని మండలం గోపాల్‌పూర్ మానేరునదిలో భారీ వరదల్లో ఆరుగురు చిక్కుకుంటే.. స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. అందరినీ సురక్షితంగా తీసుకొచ్చి ప్రజల మన్ననలు పొం దారు. కమాన్‌పూర్ పీహెచ్‌సీలో సీనియర్ అసిస్టెంట్ రాజగోపాల్ కుమారుడి గుండె ఆపరేషన్‌కు చికిత్స కోసం.. తన ఒక్క పిలుపుతో జిల్లాలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ద్వారా ₹15.73, 634 సేకరించి వారికి అందింపజేశారు. ఇలా గొప్పగా సేవలందించిన కలెక్టర్ పదకొండు నెలలకే బదిలీపై వెళ్తుండడం ఇటు ప్రజలు, అటు అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# యాస్మిన్‌బాషా తనదైన ముద్ర



షేక్ యాస్మిన్ బాషా

జగిత్యాల, జూన్ 15, (నమస్తే తెలంగాణ) : జగిత్యాల జిల్లా కలెక్టర్‌గా దాదాపు 16 నెలల పాటు పనిచేసిన షేక్ యాస్మిన్ బాషా పాలనలో తనదైన ముద్ర వేసుకున్నారు. 2023 ఫిబ్రవరి ఒకటిన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆమె తను పనిచేసిన కాలంలో ప్రభుత్వ నిర్దేశిత కార్యక్రమాలు, పథకాలను విజయవంతంగా అమలు చేశారు. గతేడాది తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. నవంబర్‌లో శాసనసభా ఎన్నికలను గతంలో జరిగినదానికి భిన్నంగా న్యాయ సమస్యలు, ఇతర చిక్కులు లేకుండా అత్యంత సాఫీగా నిర్వహించారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికలను సైతం విజయవంతంగా పూర్తి చేశారు. అంతే కాకుండా, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ, అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరవేయడంలో విజయం సాధించారు. ఆమె పాలనలో జిల్లాలోని ప్రతి మారుమూల పల్లెలను సైతం పరిశీలించారు. పలు సందర్భాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, పథకాల అమలు కార్యక్రమాలను ప్రత్యక్షంగా పరిశీలించి, అధికారులకు మార్గదర్శనం చేశారు. అధికారులు, ఉద్యోగుల అవినీతిపైనా ఆమె కఠిన చర్యలు చేపట్టారు. ముఖ్యంగా మత సామరస్యానికి ప్రతీకగా పలు సందర్భాల్లో ఆమె తన ప్రత్యేకతను నిరూపించుకున్నారు. ధర్మపురి బ్రహ్మోత్సవాలను కనుల పండువలా జరిపారు. అనేక ఆలయాలు, ప్రార్థనా మందిరాల్లో జరిగిన కార్యక్రమాల్లో నేరుగా పాల్గొన్నారు. ఆమె ధార్మిక ఔన్నత్యానికి జిల్లా ప్రజలు ముగ్ధులయ్యారు.

# విద్యార్థుల సంపూర్ణ వికాసమే లక్ష్యం

- జేఎస్3 పాఠశాలల సహకారంతో నాణ్యమైన ఫలితాలు
- వివేకానంద విద్యాసంస్థల చైర్మన్ సొగాని కొమురయ్య



సొగాని కొమురయ్య

కమాన్‌చౌరస్తా, జూన్ 15 : ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఎదురవుతున్న సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని విద్యార్థులు తమ కాళ్లపై తాము నిలిచేలా వారికి అవగాహన కల్పిస్తూ, సంపూర్ణ వికాసానికి తోడ్పాటునందించడమే తమ విద్యాసంస్థల లక్ష్యమని వివేకానంద విద్యాసంస్థల చైర్మన్ సొగాని కొమురయ్య పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాకేంద్రంలోని వివేకానంద స్కూల్ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల శరీరం, మెదడు, మనసు, హృదయం అభివృద్ధి చెందేలా వారికి అవసరమైన శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. నూతన విద్యాసంవత్సరం ఆరంభాన్ని పురస్కరించుకుని వివేకానంద విద్యాసంస్థల పనితీరుపై ఆయన సమగ్ర విశ్లేషణ చేశారు. తమ విద్యా సంస్థల్లో చదివిన వేలాది మంది ఉన్నత విద్యావంతులుగా ఎదిగారని, అనేక రంగాల్లో స్థిరపడ్డారని వివరించారు. తమ పిల్లలను ఇంటిలో పెంచే విధానంపై తల్లిదండ్రులకు శిక్షణ ఇవ్వడం తమ విద్యా సంస్థల ప్రత్యేకత అని వెల్లడించారు. విద్యార్థులు స్ఫూర్తి పొందేలా ప్రతి శనివారం సాయంత్రం వీకెండ్ విత్ ఎక్స్‌పర్ట్ అనే కార్యక్రమం నిర్వహిస్తూ చిన్నారుల్లో చైతన్య బీజాలు నాటుతున్నామని చెప్పారు. విద్యార్థి దశ నుంచే సామాజిక పరిజ్ఞానం పెంపొందిస్తున్నామన్నారు. ప్రజల జీవనం, వారి ఆలోచన విధానం తెలుసుకునేలా, పాఠ్యపుస్తకాల్లోని 76 అంశాలపై గ్రామదర్శిని అనే కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ప్రత్యక్ష బోధన చేపడుతామని స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, పోషణ, సీజనల్ వ్యాధులపై విద్యార్థుల్లో అవగాహన పెంచుతూ, హెల్త్ బేసిక్స్ నేర్పిస్తున్నామన్నారు. తోటి విద్యార్థులతో కలిసి మెలసి ఉండేలా వారికి ఆవాస నిద్ర కార్యక్రమం నిర్వహిస్తామని వెల్లడించారు.

# సమర్థవంతంగా సత్పతి విధులు



పమేలా సత్పతి

కరీంనగర్ కలెక్టర్‌గా అనతికాలంలోనే తనదైనశైలి

కరీంనగర్, జూన్ 15 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆకస్మిక బదిలీల్లో భాగంగా అక్టోబర్ 30న కరీంనగర్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన పమేలా సత్పతి అనతి కాలంలోనే సమర్థవంతురాలైన అధికారిగా నిరూపించుకున్నారు. ఇక్కడ పనిచేసిన ఆరు నెలల కాలంలో ఎక్కువగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా.. తనకు లభించిన తక్కువ సమయంలో పాలన విషయంలో తనదైన ముద్ర వేశారు. జిల్లా అధికారులు, ఉద్యోగులతో కలుపుగోలుగా ఉంటూనే విధి నిర్వహణలో మాత్రం కఠినంగానే వ్యవహరించారు. ప్రభుత్వ పరంగా వచ్చే ఆదేశాలను అమలు చేయించడంలో సక్సెస్ అయ్యారు. నవంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు, ఇటీవల పార్లమెంట్ ఎన్నికలను ఆమె అత్యంత సమర్థవంతంగా నిర్వహించారు. ఎక్కడా చిన్న గొడవ జరుగకుండా ప్రశాంతంగా ముగించడంలో విజయవంతమయ్యారు. రాజకీయంగా ఎలాంటి ఒత్తిళ్లు వచ్చినా తలొగ్గకుండా ముందుకెళ్లారు. అధికారులతో కూడా అదే విధంగా పని చేయించారు. సమీక్షలు నిర్వహించడంలోనూ తనదైన శైలిని కనబర్చారు. ముఖ్యంగా మహిళా సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రాలను తరచూ తనిఖీ చేసి పిల్లలు, గర్భిణులకు ప్రభుత్వ పరంగా అందుతున్న ప్రయోజనాలను ఎప్పటికప్పుడు సమీక్షించారు. పాఠశాలలను తరచూ తనిఖీ చేశారు. మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమాన్ని తరచూ సమీక్షించి పనులను ముందుకు సాగించే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం బదిలీపై వెళ్లిన పమేలా సత్పతికి ప్రస్తుతం ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు.



కరీంనగర్ కలెక్టర్ అనురాగ్ జయంతి



జగిత్యాల కలెక్టర్ బీ సత్యప్రసాద్



రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష

# ఉమ్మడి జిల్లాకు కొత్త కలెక్టర్లు

- రాష్ట్రంలో భారీగా ఐఏఎస్‌ల బదిలీ
- నాలుగు జిల్లాలకు కొత్త బాస్‌లు
- కరీంనగర్‌కు అనురాగ్ జయంతి
- జగిత్యాలకు బీ సత్యప్రసాద్
- సిరిసిల్లకు సందీప్‌కుమార్ ఝా
- పెద్దపల్లికి కోయ శ్రీహర్ష

రాజన్న సిరిసిల్ల, జూన్ 15 (నమస్తే తెలంగాణ): కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల తర్వాత భారీగా ఐఏఎస్‌లను బదిలీ చేసింది. ఇటీవలే పార్లమెంట్ ఎన్నికలు ముగియగా.. తాజాగా, ఒకే సారి 20 మందిని ట్రాన్స్‌ఫర్ చేసింది. అందులో ఉమ్మడి జిల్లాలోని నలుగురు కలెక్టర్లకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతిని బదిలీ చేయగా.. ఆమె స్థానంలో సిరిసిల్ల నుంచి అనురాగ్ జయంతిని నియమించారు. కాగా, ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సందీప్‌కుమార్ ఝా సిరిసిల్ల కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఆయన గతంలో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్‌గా, హైదరాబాద్ జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్‌గా పనిచేశారు. జగిత్యాల కలెక్టర్ యాస్మిన్ బాషా కూడా బదిలీ కాగా, ఆమె స్థానంలో ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్)గా పని చేస్తున్న బుడుమజ్జి సత్యప్రసాద్‌ను నియమించారు. పెద్దపల్లి కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్‌ను ఖమ్మంకు ట్రాన్స్‌ఫర్ చేయగా, ఆయన స్థానంలో నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. కాగా, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతికి ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు. జగిత్యాల కలెక్టర్‌గా ఉన్న షేక్ యాస్మిన్ బాషాను సీఎస్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ప్రస్తుతం బదిలీ అయిన నాలుగు జిల్లాల కలెక్టర్లు పాలనలో తమదైన ముద్ర వేసుకున్నారు. ప్రజలు, ప్రభుత్వానికి వారధిలా ఉంటూ పథకాలను విజయవంతంగా అమ లు చేయడమే కాదు, ఒక్కొక్కరు ఒక్కో ప్రత్యేకతను చాటారు. గతేడాది మే, జూన్‌లో నిర్వహించిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను అత్య ంత వైభవంగా నిర్వహించి ప్రభుత్వ, ప్రజల మన్ననలు పొందారు. అలాగే 2023 నవంబర్‌లో అసెంబ్లీ, ఇటీవలి పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించారు. అత్యంత సాఫీగా నిర్వహించడంలో కృతకృత్యులయ్యారు.

## సత్యప్రసాద్‌కు జగిత్యాల కలెక్టర్‌గా ప్రమోషన్

జగిత్యాల జిల్లా కలెక్టర్‌గా బుడుమజ్జి సత్యప్రసాద్ వస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లాకు చెందిన ఆయన, 2018 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వారు. రాష్ట్రంలో వివిధ హోదాల్లో పని చేశారు. గతేడాది సెప్టెంబర్ 9 నుంచి ఖమ్మం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం పదోన్నతి కల్పిస్తూ జగిత్యాల కలెక్టర్ నియమించారు. ఆయన ఎక్కడ పనిచేసినా తన ప్రత్యేకతను చాటారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, గ్రామ పంచాయతీల పాలనను సమర్థవంతంగా నిర్వహించారు.

## పెద్దపల్లికి రెండో యువ ఐఏఎస్‌గా శ్రీహర్ష

పెద్దపల్లి జిల్లాగా ఏర్పడిన ఈ తొమ్మిదేండ్లలో కలెక్టర్‌గా నియమితులైన వారిలో అతి పిన్న వయస్కుడిగా కోయ శ్రీహర్ష బాధ్యతలు స్వీకరించబోతున్నారు. ఖమ్మం జిల్లా జయనగర్ కాలనీకి చెందిన శ్రీహర్ష 2017యూపీఎస్సీ పరీక్షల్లో తొలి ప్రయత్నంలోనే ఆల్ ఇండియా 6వ ర్యాంకర్‌గా నిలిచారు. 2018లో ఐఏఎస్ శిక్షణ పూర్తి చేసుకొని, తొలుత 2020-2022వరకు జోగులాంబ గద్వాల జిల్లాలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా పనిచేశారు. 2022 అక్టోబర్ 9నుంచి ఇప్పటి వరకు నారాయణపేట కలెక్టర్‌గా కొనసాగుతున్నారు. ప్రతిష్టాత్మకమైన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, పార్లమెంట్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేశారు. సౌమ్యుడిగా, వర్క్ మైండెడ్‌గా ఆయన గుర్తింపు పొందారు. శ్రీహర్ష తల్లిదండ్రులు ఇద్దరూ ఉపాధ్యాయులే కాగా, భార్య, బాబు ఉన్నారు.

# పాలనలో అనురాగ్ మార్క్

రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సరికొత్త కార్యక్రమాలకు నాంది



బాలుడికి రాగి లడ్డూను పంపిణీ చేస్తున్న కలెక్టర్ అనురాగ్ (ఫైల్)

రాజన్న సిరిసిల్ల, జూన్ 15 (నమస్తే తెలంగాణ) : రాజన్న సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతి పాలనలో మార్క్ చూపారు. తన రెండేళ్ల పది నెలల పాలనలోనే జిల్లాను అన్ని రంగాల్లో తీర్చిదిద్దారు. సిరిసిల్ల వేదికగా అనేక కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి ప్రజల ప్రశంసలు పొందారు. విద్య, వైద్య రంగాలు బలోపేతమైతేనే పేదల జీవితాలు బాగుపడతాయని భావించి అనేక సంస్కరణలు చేపట్టి సఫలీకృతులయ్యారు. ముఖ్యంగా ప్రజల్లో ఉన్న అపోహను పోగొట్టి ఆదరించేలా చేశారు. సర్కారు బడులను బలోపేతం చేశారు. పిల్లలకు ఆధునిక ఐటీ, ఐటీ ఆధారిత విద్యా బోధన అందించేందుకు చర్యలు తీసుకున్నారు. 60 ప్రభుత్వ పాఠశాలల్లో 12,800 మందికి కంప్యూటర్ చాంప్స్ పేరుతో డిజిటల్ అక్షరాస్యత కార్యక్రమాన్ని అమలు చేశారు. ప్రభుత్వ వైద్యశాలలను పూర్తిగా ప్రక్షాళన చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, తనిఖీలు చేసి వైద్య సేవల్లో పురోగతికి కృషి చేశారు. మరోవైపు క్షేత్ర స్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేశారు. ఆరు పీహెచ్‌సీలకు ఎన్‌క్వాస్ సర్టిఫికెట్ రావడం ఆయన పనితీరుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. అలాగే ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్యను పెంచి ప్రైవేట్ దోపిడీకి అడ్డుకట్టవేయాలని 'మిషన్ 80' అనే కొత్త పథకానికి శ్రీకారం చుట్టి విజయవంతమయ్యారు. ప్రభుత్వ దవాఖానలపై గర్భిణులకు నమ్మకం కల్పించి 50 శాతం ఉన్న ప్రసవాల సంఖ్య 80కి పెంచేలా చేశారు. గర్భిణుల కోసం ప్రత్యేకంగా జిల్లా దవాఖానలో 'మాతృసేవా' కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలోనే మొదటి సారిగా జిల్లాలోని తొమ్మిది పీహెచ్‌సీల్లో ఫిజియోథెరపీ సేవలను ప్రారంభించి, పేదలకు బాసటగా నిలిచారు. ఇటు జిల్లాను పోషకాహారలోప రహితంగా తీర్చిదిద్దేందుకు 'మిల్లెట్ ఫుడ్ ఫెస్టివల్' కార్యక్రమాన్ని అమలు చేశారు. కాల్షియం, ఐరన్ , పీచు పదార్థం ఎక్కువ ఉండే రాగి లడ్డూను ప్రతి శనివారం అంగన్ వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులకు అందించారు. ఈ ప్రయోగంతో పోషకాహారలోప నివారణకు చెక్‌పెట్టడంతోపాటు స్థానిక రైతులను చిరుధాన్యాల సాగువైపు మళ్లించారు. జీవిత చరమాంకంలో వృద్ధులకు ఆహ్లాదాన్ని అందించి ఆయుష్షును పెంచేందుకు మానవీయ కోణంలో రాష్ట్రంలోనే తొలి డే కేర్ సెంటర్‌ను ఎల్లారెడ్డిపేటలో ప్రారంభించారు. మండేపల్లిలో ప్రభుత్వ వృద్ధాశ్రమాన్ని త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చారు. జిల్లాలో ఆరు ఎస్సీ హాస్టళ్ల ఆధునీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. విద్యార్థులకు కావాల్సిన అన్ని సదుపాయాలు ఉండేలా ప్రత్యేక చొరవ చూపారు. పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు సిరిసిల్ల అర్బన్ పార్క్, వేములవాడ మూలవాగు బండ్ పార్క్, సిరిసిల్ల కొత్త చెరువును అందంగా తీర్చిదిద్దారు. ఇంకా ప్రభుత్వ పథకాలు క్షేత్ర స్థాయిలో అర్హులందరికీ అమలయ్యేలా చూసి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఇలా అన్నింటా తనదైన ముద్రవేసుకున్న అనురాగ్ జయంతి ఇప్పుడు కరీంనగర్ జిల్లాకు బదిలీ అయ్యారు.

# గొర్రెల పంపిణీ ఏది?

- రెండో విడుత కొనసాగింపుపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి
- సమస్యలు పరిష్కరించి గొల్లకుర్మలను ఆదుకోవాలి
- గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం కరీంనగర్ జిల్లా శాఖ ప్రతినిధుల డిమాండ్
- కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా





ప్లకార్డులతో గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం కరీంనగర్ జిల్లా శాఖ ప్రతినిధులు

కరీంనగర్ కలెక్టరేట్, జూన్ 15 : ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన మాట తప్పిందని, రెండో విడుత గొర్రెల పంపిణీ ఏమైందని తెలంగాణ గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం కరీంనగర్ జిల్లా శాఖ ప్రతినిధులు నిలదీశారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత డీడీలు చెల్లించిన వారికి గొర్రెలు పంపిణీ చేస్తామని చెప్పారని, ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. అసలు గొల్లకుర్మలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహించారు. శనివారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ నియోజకవర్గ అధ్యక్షుడు సందెబోయిన ప్రసాద్‌యాదవ్ మాట్లాడారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ప్రారంభించిన గొర్రెల పంపిణీ పథకం కొనసాగింపుపై కాంగ్రెస్ సర్కారు స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని వేడుకున్నారు. గొర్రెలు, మేకల పెంపకం ప్రాథమిక సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. గొల్లకుర్మలకు సంక్షేమ పథకాలన్నీ సహకార సంఘాల ద్వారా మాత్రమే అమలుచేయాలని కోరారు. మటన్ ప్రాసెసింగ్ యూనిట్‌ను జిల్లాలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సత్వరమే స్థలం కేటాయించాలని కోరారు. ధర్నాలో కరీంనగర్ పట్టణాధ్యక్షుడు జంగ కొమురయ్య, నాయకులు గాదం శ్రీనివాస్, రాధారపు కుమార్, వివిధ మండలాల నుంచి వచ్చిన అధ్యక్ష, కార్యదర్శులు ముక్కెర సదానందం, పరశురామ్ యాదవ్, జిట్ట కొమురవెళ్లి, శంకర్ యాదవ్, మర్రి ఐలయ్య, ఆసరి రాజు, భూస రాజు, సందెబోయిన స్వామి, పీరాల రవీందర్ పాల్గొన్నారు.

# ప్రైవేట్‌కు దీటుగా విద్యనందించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్, జూన్ 15: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ స్కూల్స్ విద్యార్థులకు విద్యనందించాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని సిటీ సెంట్రల్ హాల్‌లో నియోజకవర్గంలోని అన్ని మండలాల ఎంఈవోలు, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యాబోధన చేయాలని కోరారు. ఉత్తమ ఫలితాలు సాధించిన పాఠశాలల ఉపాధ్యాయులను సన్మానిస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ విజయ, ఎంపీపీ ఇరుమల్ల రాణి, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.






# కామాంధుడికి మరణదండన విధించండి

- మహిళా సంఘాల ప్రతినిధుల ఆందోళన
- గోదావరిఖని చౌరస్తాలో దిష్టిబొమ్మ దహనం



చౌరస్తాలో కామాంధుడి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న మహిళా సంఘాల ప్రతినిధులు

కోల్‌సిటీ, జూన్ 15 : అభం శుభం తెలియని ఆరేళ్ల చిన్నారిని చిదిమిన కామాంధుడికి ప్రజా కోర్టులో ఉరి శిక్ష విధించాలని మహిళా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో జరిగిన బాలికపై లైంగిక దాడి, హత్యకు నిరసనగా గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో శనివారం కామాంధుడి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా శ్రీ సీతారామ సేవా సమితి అధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ మాట్లాడుతూ, గంజాయి మత్తులో ఓ మానవ మృగం ఆరేళ్ల బాలికపై లైంగికదాడి చేసి, ఆపై హత్య చేయడం యావత్తు సమాజాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. విచ్చలవిడిగా గంజాయి మత్తు పదార్థాల విక్రయాలు జరుగడం వల్లే ఇలాంటి ఘోర ఘటనలు జరుగుతున్నాయని, దీనికి బాధ్యులెవరని ప్రశ్నించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలను అరికట్టలేని అసమర్థత ఎవరిదని ప్రశ్నించారు. ఆడపిల్లలను కన్న తల్లిదండ్రులకు కంటి మీద కునుకు లేకుండా పోతున్నదన్నారు. ఇలాంటి లైంగికదాడులు, హత్యలను అరికట్టాలంటే ప్రభుత్వం స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బాలిక కుటుంబానికి రైస్ మిల్లు యాజమాన్యంతోపాటు ప్రభుత్వం ₹50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలన్నారు. ధర్నాలో ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేశ్, మహిళా సభ్యులు కంది సుజాత, మేడగోని స్వప్న, మందల రమాదేవి, సరిత, లక్ష్మి, పిట్టల చంద్రకళ, బోగె లత పాల్గొన్నారు.



కొచ్చెరువులో తన వలకు చిక్కిన బంగారు తీగ చేపను చూపుతున్న మత్స్యకారుడు

# మీనా'నందం'

జూలపల్లి, జూన్ 15: జూలపల్లి కొచ్చెరువులో శనివారం మత్స్యకారుల వలకు 15 కిలోల బంగారు తీగ చేప చిక్కింది. బరువైన మీనాన్ని చూసి మత్స్యకారుడు సంబురపడ్డాడు. ఇటీవల కాలంలో ఈ చెరువులో ఇంత పెద్ద చేప చిక్కలేదని సంతోషం వ్యక్తం చేశాడు.


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం

మరియు

- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..



ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571